# గొర్రె

## రావాడ శ్యామల

**హాస్పిటల్ బెడ్ మీద అసహనంగా కదిలాడు అప్పన్న. అక్కడి వాతావరణం తలచుకోగానే కంపరం కలిగింది. అందులో తను ఉండేది జనరల్ వార్డులో. అక్కడ మంచానికి, మంచానికి నాలుగడుగుల దూరం. ఏ కొత్త కేసొచ్చినా ఇట్టే తెలిసిపోతుంది. పేషంట్ల మూలుగులు, రోదనలు,ఆక్రందనలు....మందుల వాసన...వార్డు పక్కనే ఉన్న బాత్రూమ్‌ల నుండి వచ్చే రొచ్చు వాసన.. అప్పుడప్పుడూ పవర్ లేని ఫినాయిల్ వాసన..వీటన్నింటి మధ్య పది రోజుల నుండి ఉంటున్నాడు. అదే తనకి అవమానంగా, ఆశ్చర్యంగా ఉంది.**

**వార్డు బయట ఎవరో ఆమె..పురుగుల మందు తాగిందని తీసుకొచ్చారు. ఆమెచేత ఉప్పునీళ్ళు తాగించి వాంతులు చేయిస్తున్నారు. హెడ్డు నర్సు రాజమ్మ కంచుకంఠం ఖంగు మంది. రాజమ్మ పొట్టిగా, లావుగా, చామన ఛాయలో ఉంటుంది..నుదుటి మీద పెద్ద స్టిక్కరు బొట్టు. ముక్కుకి రెండు వైపులా నల్లని మచ్చలు... ఆకారమే కాదు, గొంతు విప్పినా అందరూ జడుసుకోవలసిందే. రాజమ్మ అరుస్తోంది.**

''నోరు తెరవ్వే ...నోరు తెరు...'' చెంప ఛెళ్ళు మనిపించింది. ''కూల్‌డ్రింక్ లాగా విషం తాగావు కదే... అలాగే ఈ ఉప్పునీళ్ళు తాగు...ఊc...తాగు.''

ఆమె భళ్ళున వొళ్ళో వాంతి చేసుకుంది. ఆ వాసన భరించలేక ఆమె చీర సర్రున లాగేసింది. నర్సు రాజమ్మ పాపం ...ఆమె బెదిరి పోయి గుండెలకు చేతులడ్డం పెట్టుకుంది.

''చాల్లేయే ..నీ సిగ్గు ... సిగ్గు మండిపోనూ... ముందీ నీళ్ళు తాగు..''

బలవంతంగా నోట్లో జగ్‌తో నీళ్ళు పోస్తున్నారు. కిటికీ నుంచి చూస్తున్న అప్పన్నకు కడుపులో దేవినట్లయింది. పురుగుమందు ప్రభావం ఎక్కువగా ఉందో, ఏమో ఆ ఆడ మనిషి చనిపోయింది.. బంధువులు ఘొల్లు మన్నారు.

''ఈ రోజు డాక్టర్‌కి చెప్పి , ఎలాగైనా ఇంటికి వెళ్ళిపోవాలి. ఇంక ఈ నరకంలో ఉండలేను'' మనుసులో స్థిరంగా అనుకున్నాడు.

పావుగంట తరువాత నర్సు రాజమ్మ పెద్దగా సణుక్కుంటూ వార్డులోకి వచ్చింది. ''దిక్కుమాలిన చావులు... ఆ చావేదో అక్కడే చావొచ్చు కదా .. ఇక్కడికొచ్చి మమ్మల్ని చంపడానికి కాకపోతే..''

''ఏమే ...డాక్టరు రౌండ్‌కి వస్తారు .. ఇంకా ఏంటే అంత తీరిగ్గా కూర్చుని మింగుతున్నావు.. బేగి తిను..''

''రేయ్ .. ఏట్రా అది .. బేవర్స్ నా కొడకా.. ఇంకా తెల్లార లేదా .. వెళ్ళరా .. మొఖం కడుక్కుని కూర్చో .. డాక్టరుగారొస్తారు.

''ఎవర్తే .. అదీ .. పేషెంట్ బెడ్ మీద నువ్వేం తల్లీ పడుకున్నావూ.. నీ మొగుడేడీ...

''ఆయన .. బాత్రూమ్‌కి వెళ్ళాడమ్మా .. అందుకే .. చేరబడ్డాను..'' భయం, భయంగా అందా ప్రాణి.

''బెడ్ ఖాళీగా ఉంటే, పడుకుండి పోతావా.. రా .. ఆ చివర.. బెడ్ ఖాళీగుంది..అక్కడ తొంగో ..''

''తప్పయిందమ్మా ... లేచిపోతాను'' బెదిరి పోతూ అంది.

''లేదు ... చెప్పు .. లేదంటే ఈ పక్క మంచం ఖాళీ చేయిస్తాను.. నీకొకటి.. నీమొగుడి కొకటి ... ఇద్దరూ సక్కగా తొంగోండి..''

ఆమె కళ్ళలో నీళ్ళొచ్చాయి. ఏం మాట్లాడలేదు. ఆమెకి ఎదురు జవాబిస్తే ఏం జరుగుతుందో తెల్సు... అందుకే చాలా మంది వాళ్ళకి ఇష్టం లేకున్నా, వాళ్ళ అవసరాలు కాబట్టి ఆమెని అక్కా అనో .. రాజమ్మ అనో నవ్వుతూ పిలిచి, ప్రసన్నం చేసుకుంటారు. ఆమె చేతులు మాటి మాటికీ తడుపుతారు. వాళ్ళని ఏం అనదు. లేదంటే ప్రతి పేషంట్‌ని మాటల తూటాలతో పొడిచి చంపేస్తుంది.

అప్పన్న బెడ్ దగ్గరకు వచ్చింది. ''ఏవయ్యా .. ఇంకా తొంగున్నావు..లే..'' తప్పదన్నట్లు, లేచి కూర్చున్నాడు. కానీ, ఆమె వైపు చూడలేదు.

''చింత చచ్చినా.. పులుపుసావదంటా.. అలా ఉంది నీ యవ్వారం.. నీ యవ్వ ... మొఖం కాలి మాడి పోయింది . ఇంకా పొగరు తగ్గలేదు.. నాకొడకడికి ..ధూc...'' అనుకుంటూ అక్కడ నుండి పక్క బెడ్‌కి కదిలింది.

ఉక్రోషంగా చూడ్డం తప్ప, ఏం జవాబివ్వలేదు.

ఆమె సంగతి తెలియక వారం కిందట ఆమెతో నోరు చేసుకున్నాడు. ''ఏటనుకుంటుందో..ఏంటో.. ఈ అప్పన్న అంటే.. అన్నని కలవడానికి వచ్చినోళ్ళు , ముందు తనని కలిసి, తన పర్మిషన్ తీసుకుని అన్నని కలిసే వాళ్ళు. పవర్ ఫుల్ పార్టీ నాయకుడి కుడి భుజం తను. అలాంటి తనని పట్టుకుని ..'' ఏరా .. ఒరేయ్..'అని పిలిస్తే, ''మర్యాదగా..మాట్లాడు'' అన్నాడు. అంతే.. ఇంకా రెచ్చిపోయింది.

''ఏరా.. నువ్వేటి మినిష్టర్ వనుకుంటున్నావా.. నీకు మర్యాదలు చెయ్యడానికి .. అడ్డమైన ఎదవలకందరికీ సేవలు చెయ్యాల్రా.. మేము..'' ఆ కోపాన్నంతా .. తన గాయాల మీద '' చూపించింది. పెచ్చులూడిన మట్టిగోడలకి మట్టి మెత్తినట్లు ఆయింట్‌మెంట్ మెత్తేసి, టకటకా రాసి పడేసింది. కాలిన.గాయాలు.. మరింత మంట పెట్టాయి. ఆ రోజు నుండి ఏదో ఒకటి అంటూ ఇంకా తిరుతూనే ఉంది. ఎలా ఉండే వాడు ... ఎలా అయిపోయాడు. ఒక ఆడదాని దగ్గర నోరు మెదపలేక పోయాడు. తన మీద తనకే కోపం వస్తోంది.

ఇంత కష్టంలోనూ.. అప్పన్న తన పార్టీ నాయకుడు రాజాబాబు గురించే ఆలోచిస్తున్నాడు. నిన్న సాయంత్రం... నర్సింగ వచ్చి చెప్పిన దగ్గర నుండి ఆలోచనలన్నీ అటే పోతున్నాయి. అన్న ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నాడు. నేను లేకపోయేసరికి, ఎవరికి తలవంచ వలసి వచ్చిందో ... వెంటనే వెళ్ళి కలవాలి.''

అన్న తీసుకున్న నిర్ణయం తప్పు... తప్పది.. చెప్పాలి. ఐనా అది నిజమో, కాదో.. నర్సింగ అబద్దం చెప్పాడో ముందు అది తెలియాలి. అన్నకి నేను నచ్చ చెపుతానంటే ఆ నర్సింగ ఏమన్నాడూ...'' ఒరే అప్పిగా. ఆళ్ళకి నీ అవసరం తీరిపోయిందిరా... నీ అవసరం లేదింక... అన్నకి.. తమ్ముడి నంటావు గదా.. మరి .. ఈ గవర్నమెంట్ హాస్పిటల్‌లో ఎందుకురా పడేశారు. నిన్ను చూడ్డానికి ఒక్కసారైనా వచ్చారా.. నీ పిచ్చిగానీ..నువ్వు చెపితే వింటారా..'' అంటూ నా బుర్ర చెరచాలని చూశాడు. దొంగ సచ్చినోడు.. గోతికాడ నక్కలా కాచుక్కూచున్నాడు. నా స్థానం దక్కించుకోవాలని చూస్తున్నాడు. నా ముందు

వాడెంత...నేను అన్నకి కుడి భుజం... వాడు చిటికెన వేలుకి పనికి రానోడు... నన్ను మాటలతో మభ్యపెట్టి, అన్నమీద చాడీలు చెప్పి, నా మనసు విరిచేయాలని చూస్తున్నాడు..''మనసులో అనుకున్నాడు అప్పన్న.

గాయాలు పూర్తిగా మానక పోయినా..అన్నని కల వడానికోసం... డాక్టర్‌ని అడిగి డిశ్చార్జ్ అయ్యాడు.

జిల్లాలో ప్రధాన పార్టీలు రెండు. ఒకటి ''మన దేశం'', రెండు ''ప్రామిస్''. మనదేశం నాయకుడు రాజాబాబు .. ప్రామిస్ పార్టీ నాయకుడు రామ్మూర్తి , ఇద్దరి నాయకుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమం టుంది. నాయకులకే కాదు... వాళ్ళ..వాళ్ళ కార్యకర్త లదీ ఇదే వరస..చిన్న సందు దొరికిందా .... కొట్టుకు చావడానికి రెడీగా ఉంటారు.

రాజాబాబుకి నమ్మిన బంటు అప్పన్న. కాలేజీ రోజుల్లో రాజాబాబుకి జూనియర్ అప్పన్న. సీనియర్ల ర్యాగింగ్ నుండి రక్షించినందుకు అప్పుడే రాజాబా బుకి దాసోహమయ్యాడు. కండల వీరుడు అప్పన్న. కాలేజీ రోజుల్లోనే రాజకీయాలు బాగా వంట బట్టిం చుకుని.. కాలేజీ ఎలక్షన్లో నిలబడి నాయకుడిగా నిల దొక్కుకున్నాడంటే... అందుకు చాలా వరకు అప్పన్న అండ.. దండలు... సహాయ సహకారాలు చాలా వరకు అవసరమయ్యాయి. అప్పటి నుండే రాజా బాబు అప్పన్నని తనగుప్పిట్లో ఉంచుకున్నాడు.. ఆపోజిట్ పార్టీ అంటే అప్పన్నకి నరనరాల్లో ద్వేషాన్ని నింపాడు. ఎంతగా అంటే .. అసలు వాళ్ళని తలచుకో వడానికి.. చూడ్డానికి కూడా ఇష్టపడనంత...

అలాంటి అపోజిషన్ పార్టీ ద్వేషి అప్పన్న చెల్లెలు సుజాత... ఆ ఆపోజిట్ పార్టీ కార్యకర్త కొడుకు సుధాక



ర్‌ని ప్రేమించింది. వాళ్ళ ప్రేమ పెళ్ళి వరకు వచ్చింది. అది తెలిసి భగ్గుమన్నాడు అప్పన్న. ''అన్నకి తెలిస్తే , ఎంత బాధ పడతాడో'' అన్నదే వాడి బాధ.


''అన్నయ్యా... నువ్వు అంతగా వాళ్ళకి ఒదిగి పని చేయకు. వాళ్ళ బ్రతుకు వాళ్ళది. మన బ్రతుకులు మనవి.. మనం ఎలా బ్రతకాలో చెప్పడానికి వాళ్ళె వరు ? చూడూ.. నీ అవసరం ఉన్నంత వరకూ బాగానే చూస్తారు.

నీ అవసరం తీరిపోయాక వాళ్ళు నిన్ను గడ్డిపోచ కింద చూస్తారు. నా మాట విను. అక్కడ పని మానెయ్.. ఎక్కడైనా ఉద్యోగం చూసుకో.. సుధాకర్ చాలా మంచి మనిషన్నయ్యా.. అతనికి పార్టీలతో సంబంధం లేదు. నాతోపాటే టీచర్‌గా పని చేస్తు న్నాడు..' తల్లి...చెల్లి ఎంతగా చెప్పినా వినలేదు.

సుధాకర్ కూడా అప్పన్నని కలిసి..' మీ చెల్లిని మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను... ఆమెకి ఏ కష్టం రాని వ్వనండి.. పెళ్ళైనా మేమిద్దరం... ఈ ఊరికి దూరంగా .. మా ఉద్యోగాలు ఉన్న ఊర్లోనే ఉంటాము. ఈ రాజ కీయాలకు దూరంగా ఉంటాము..'' అని ఎంతో విన యంగా వేడుకున్నాడు.

సుధాకర్ మంచి రూపం, ఒడ్డు.. పొడుగు ఉన్న మనిషి, ఎంచడానికి ఏ కారణం కనిపించదెవరికీనూ.. కానీ, అప్పన్న కళ్ళకి మాత్రం వాడు... ఎగినెస్టుపార్టీ వాడు... అంతే.. అదే చాలు..'' అందుకే పెళ్ళికి ససే మిరా కాదన్నాడు.

ఇద్దరూ మేజర్లే కనుక పారిపోయి పెళ్ళి చేసుకుం దామనుకున్నారు. విషయం తెలిసి, మనుషులతో వెళ్ళి సుధాకర్‌ని బాగా కొట్టించాడు. హాస్పిటల్‌లో రెండు రోజులు మృత్యువుతో పోరాడి మూడోరోజు చనిపోయాడు. అది తెలిసి సుజాత ఉరిపోసుకుని



చచ్చిపోయింది. ఇద్దరూ అమర ప్రేమికులు... వాళ్ళని విడదీయకండి.. ఇద్దరినీ కలిపి దహనం చేయండి... అని కుర్రకారు కొందరు గొడవపడినా లెక్కచెయ్య లేదు. సుజాత శవానికి సుధాకర్ నీడ పడకుండా వేరేగా దహనం చేశాడు. అదంతా తన పార్టీ కోసం త్యాగం చేసినట్లు గర్వించాడు. రాజాబాబు, అప్పన్న పార్టీ నిష్ఠకి పొంగి పోయాడు.

కూతురు పోయిన బాధతో ...అప్పన్న తల్లి కూడా పది రోజులు తిరక్క ముందే చనిపోయింది. ఇంక అప్పన్నకి అడ్డు చెప్పేవారు లేరు. ఇరవైనాలుగు గంటలూ రాజాబాబు ఇంటి దగ్గరే.. అన్ని పనులు తన భుజ స్కంధాలపై వేసుకుని చకాచకా చేసేవాడు. అన్నసేవలో ఎంతగా నిమగ్నమయ్యాడంటే, తనకి ముప్పై ఐదు దాటుతున్నా, పెళ్ళి చేసుకునే ఆలోచనే రాలేదు.

ఈ సారి పార్టీ టికెట్టు రాజాబాబుకి కాక మరొకరికి ఇవ్వడానికి అధిష్ఠానం నిర్ణయించడంతో గొడవలు, అల్లర్లు మొదలయ్యాయి. పార్టీ కార్యాలయాల్లో కార్యకర్తల నిరసనలు... అప్పన్న ఇంకో అడుగు ముందుకేసి.. అందరూ చూస్తుండగానే... పెట్రోలు వంటి మీద పోసుకుని, ''అన్నకి టికెట్ ఇప్పించకపోతే నా లాగే ఎందరో ఆత్మాహుతికి పాల్పడతారని చెప్పి.. మరీ అంటించుకున్నాడు. మంటలు భగ్గుమన్నాయి. కొందరు గబగబా మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు...కానీ అప్పటికే మొఖం, చేతులు.. నడుము అవీ కాలిపోయాయి.

స్పృహ తప్పిన అప్పన్న గవర్నమెంట్ హాస్పిటల్‌లో తేలాడు. రాజాబాబుకి టికెట్ మంజూరైంది. పది రోజుల ట్రీట్ మెంట్‌తో సగం నయమైంది. కాలిన గాయాల బాధ కన్నా , నిన్న నర్సింగ చెప్పిన వార్తే బాధ కలిగిస్తోంది.

''రాజాబాబు తమ్ముడు.. ఎగినెస్టు పార్టీ రామ్మూర్తి కూతుర్ని ప్రేమించాడంట... దానికి ముందు గొడవ పడినా.. ఇద్దరికీ పెళ్ళి ఖాయం చేశారంట...ఎల్లుండే నిశ్చితార్థం. చాలా గ్రాండ్‌గా చేస్తున్నారు.'' అని చెప్పాడు నర్సింగ.

ఆలోచనలతోనే, రాజాబాబు ఇంటికి చేరాడు. ఇంటా బయటా పూలతో.. లైట్లతో , కలర్ పేపర్స్‌తో డెకరేషన్లు చేస్తున్నారు. ఎవరూ తనను గమనించడం లేదు...కొందరు చూసినా దూరంగా జరిగిపోతున్నారు. ఇంట్లో రాజాబాబు...ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు.

''అన్నా...బాగున్నావా..?'' ఆప్యాయంగా పలుకరించాడు.

''ఎవరూ...అప్పన్నా...నువ్వేనా.. బాగున్నావురా.. పూర్తిగా తగ్గలేదు...అప్పుడే ఎందుకు వచ్చేసావు...ఇంకో పది రోజులు రెస్టు తీసుకోరా..ఉండు అర్జెంట్ కాల్ ఇది... ఫోన్ తీసుకుని పక్కకి వెళ్ళి మాట్లాడుతున్నాడు.

అప్పన్నకు ఆశ్చర్యం వేసింది. నాకు కూడా తెలియని రహస్యమా.. ఏదయినా ఎవరితోనైనా నా ముందే మాట్లాడేవాడు. ఈ రోజు ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడు. రూమ్‌లో నుండి బయటకు వచ్చిన అమ్మగారు.. రాజాబాబు భార్య శారదమ్మ...''అప్పన్నా .. బాగున్నావా..ఎందుకొచ్చేసావు...నాల్రోజులు ఇంట్లో ఉండకపోయావా... ఇవి... ఈ అరటిగెల మేడ మీద పెట్టు...అన్నట్టు పని చెయ్యగలవు కదా...'' అప్పన్న జవాబు వినకుండానే...అక్కడి నుండి వెళ్ళిపోయింది.

''అరటిగెల మేడమీద పెట్టి వచ్చి అన్నతో మాట్లాడాలి.'' మనసులో అనుకున్నాడు. మేడమీదకి కష్టపడి వెళ్ళి గెలపెట్టి వచ్చాడు. హాలు దగ్గరకు వచ్చేటప్పటికి...శారదమ్మ గొంతు గట్టిగా వినిపిస్తోంది.

''వాడు ఎందుకొచ్చాడు...శుభమా, అని పెళ్ళి పనులు అవుతుంటే, ఆ దరిద్రగొట్టు మొఖం..వాడు.. ఏం చెపుతారో నాకు తెలియదు... వాడు మాత్రం ఇక్కడ ఉండకూడదు.... అంతే..''

వదినమ్మేనా ఇలా మాట్లాడుతోంది. అప్పన్న అవాక్కయిపోయాడు. అన్న ఎక్కడికైనా బయటకు వెళితే, వదినమ్మని ఎదురు రమ్మనేవాడు. ''నేనెందుకండీ... పక్కన మీ కుడి భుజం... లక్ష్మణుడి లాంటి తమ్ముడు అప్పన్న ఉండగా... ఇంక నాకేం భయం... అంటూనే ఎదురొచ్చేది వదినమ్మ. ఆమె చెప్పిన అడ్డమైన పనులు చేసేవాడు...అప్పన్న కళ్ళలో కన్నీరుబికింది.

''అదేటమ్మా ... ఆడు... ఈ ఇంటినే నమ్ముకుని బతుకుతున్నాడు. ఆడి వల్లే... అయ్యగారికి టికెట్ వచ్చింది కదమ్మా...''నసుగుతూ అన్నాడు నర్సింగ.

''అయితే ఏటి చెయ్యమంటావురా... చంక నెక్కించుకుని తిరగాలా... నీ ఉద్దేశ్యం ఏంటిరా.. ఆడు లేకపోతే నాకు టికెట్ రాదు...అంతేనా... ఆడు కాకపోతే... ఇంకొకడు.. నా కాలి కింద చెప్పులాంటోడు ఇంకొకడు.. ఆడు తగలెట్టుకుంటాడు... పేరుకి నాకోసం.. కానీ, ఆడు ఆ పని చేసినందుకు డబ్బులు దొబ్బుతున్నాడు కదా..'' రాజాబాబు కస్సుమన్నాడు.

''తన ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమించే రాజాబాబు మాటలు తూటాల్లా తగిలాయి అప్పన్నకు.

''అన్నా.. నువ్వు పదివేలు ఇచ్చావు... అది... ఆడికి ఏం సరి పోతాదన్నా.. నువ్వే .. ఆడితో అన్నావు.. కాల్చుకుంటే ప్లాస్టిక్ సర్జరీ చేయిస్తానన్నావు.'' నర్సింగ ఉద్వేగంగా అన్నాడు.

ఒరే తొత్తు నా కొడుకుల్లారా... నేనెప్పుడన్నానురా.. అన్నానే అనుకో. మీరేం... నాతో పాటు రక్తం పంచుకు పుట్టినోళ్ళు అనుకుంటున్నారా...మీకు లక్షలు... లక్షలు తగలెయ్యడానికి...ముష్టిముండా... కొడుకుల్లారా.. ఆడికి చెప్పు.. ఇంకెప్పుడూ... ఈ ఇంటి గుమ్మం తొక్కొద్దని... పిల్లలు చూస్తే జడుసుకుంటారు.. అంతే కాదు.. నా వియ్యంకుడు రామ్మూర్తికి... వీడంటే ఒళ్ళు మంట.. మా చెడ్డ చిరాకు.. వీడి మొఖం కనిపించకూడదని షరతు పెట్టాడు తెల్సా... దరిద్రం ముండా కొడుకు.. నువ్వు ఎక్కువ నీలిగితే ఆడితో పాటు నువ్వూ ఎల్లిపో ....'' గర్జించాడు రాజాబాబు.

అప్పన్న కళ్ళముందు .. తను కట్టుకున్న ఆశల సౌధాలన్నీ కుప్పకూలిపోయాయి. కళ్ళలో చెల్లి సుజాత మెదిలింది... సుజాత మాటలు గుర్తొచ్చి, చెల్లి కోసం గుండెలవిసేలా ఏడ్చాడు. కానీ, ఏం లాభం... చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే... ఓ గొర్రె బలైంది అంతే...

*

రచయిత ఫోన్ నెంబరు: ***08922-225791***